

"వెన్నతో నాకు కలిగె వేంకటేశు మంత్రము"

- అన్నమయ్య

# అన్నమయ్య కార్తీక సంధ్య

**28.11.2004**



తందనాన ఆహి...

# అన్నమయ్య కార్తీక సంధ్య

కూర్పు

కామిశెట్టి శ్రీనివాసులు

అన్నమాచార్య మిషన్

హైదరాబాద్

2004

అన్నమయ్య కార్తీక సంధ్య
కీర్తనలు - తాళ్లపాక అన్నమాచార్యులు
బొమ్మలు - బాపు
ప్రతులు - 1000
తేది - 28.11.2004
తారణనామ సంవత్సరం,
కార్తీక బహుళ విదియ, ఆదివారం

ప్రచురణ
అన్నమాచార్య మిషన్
సాయి రెసిడెన్సి
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ
హైదరాబాదు - 500 013.
ఫోన్ - (040) 27426842
సెల్ - 94402 84528

ముద్రణ
రెడ్డి గ్రాఫిక్స్
నారాయణగూడ, హైదరాబాద్. ఫోన్ - 98492 56792

# మనవి

"అన్నమయ్య కార్తీక సంధ్య" నామాంకితమైన ఈ చిన్న పొత్తంలో 21 అన్నమయ్య పాటలున్నవి. అక్షరాలలో ఆకృతిని పొందిన ఈ కీర్తనలు 28.11.2004 కార్తీక బహుళ విదియనాడు వర్ధిష్ణువైన సుమధుర గాయని శ్రీమతి సునీతాబాలాజి ఆలపించినవి. వీరితో గొంతు కలిపిన శ్రీ మురళీధర్ సుప్రసిద్ధ సినీ నేపథ్య గాయకుడు. "అన్నమయ్య వరప్రసాద్" అని ఖ్యాతినార్జించిన శ్రీ గరిమెళ్ల బాలక్రిష్ణ ప్రసాద్ వద్ద శిక్షణ పొందిన శ్రీమతి సునీతాబాలాజి తనదైన విలక్షణమైన శైలిలో గానం చేస్తూ విశేషమైన ప్రచారాన్ని, ప్రశంసలను పొందినది.

గానం ఆపాతమధురమైనా గాలిలో కలిసిపోతుంది. భావం అక్షరాకృతిని పొంది ఆలోచనామృతమై శాశ్వతత్వాన్ని సంతరించుకొంటుంది. ఈ పుస్తకాన్ని చేత పట్టుకొని పాటలు వినడం అర్థవంతమైన ఒక మధురానుభవం. అన్నమాచార్య మిషన్ ఆ పవిత్రాశయంతో వెలిగించే 'కార్తీక దీపం' ఇది.

'అన్నమయ్య కార్తీక సంధ్య' కార్యక్రమ నిర్వహణలో గ్రంథ ముద్రణలో తోడ్పడిన సహృదయులందరికి శ్రీనివాసుని అనంత మంగళాశాసనాలు.

భవదీయుడు,
కామిశెట్టి శ్రీనివాసులు

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | అదివో అల్లదివో | 9 |
| 2. | తందనానా ఆహి | 10 |
| 3. | వినరో భాగ్యము | 11 |
| 4. | కొండలలో నెలకొన్న | 12 |
| 5. | సోదించిరిదియే | 13 |
| 6. | బ్రహ్మ కడిగిన | 14 |
| 7. | ఏడవలపేడ | 15 |
| 8. | ఆకటి వేళల | 16 |
| 9. | మేలుకో శృంగార రాయ | 20 |
| 10. | జగడపు చనవుల | 21 |
| 11. | వాడల వాడల వెంట | 22 |
| 12. | మూసిన ముత్యాన | 23 |
| 13. | చూడరమ్మ సతులాల | 24 |
| 14. | సువ్వి సువ్వి | 25 |
| 15. | చిన్ని శిశువు | 26 |
| 16. | ఏమని పొగడుదుమే | 27 |
| 17. | ఉదయాద్రి తెలుపాయ | 28 |
| 18. | తిరొతిరొ జవరాల | 29 |
| 19. | ఆరగించి కూర్చున్నాడు | 30 |
| 20. | సందెకాడబుట్టినట్టి | 31 |
| 21. | జయ మంగళము నీకు | 32 |

# అధ్యాత్మ సంకీర్తనలు



అదిగో అల్లదిగో..

# అదివో అల్లదివో

అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగలమయము ॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిలమునులకు
అదె చూడుడదె మ్రొక్కుడానందమయము ॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగి నున్నదేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్నధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥

కైవల్యపదము వేంకటనగమదివో
శ్రీ వేంకటపతికి సిరులైనది
భావింప సకలసంపదరూపమదివో
పావనములకెల్ల పావనమయము ॥

# తందనానా ఆహి

తందనాన ఆహి తందనానా పురె
తందనానా భళా తందనాన ॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటే పర-
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటే ॥

కందువగు హీనాధికము లిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటునిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే
చండాలు డుండేటి సరిభూమి యొకటే ॥

కడగి యేనుగు మీద కాయు యెండొకటే
పుడమి శునకము మీద పొలయు నెండొకటే
కడు పుణ్యులను పాప కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటేశ్వరు నామ మొకటే ॥

# వినరో భాగ్యము

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ ॥

ఆది నుండి సంధ్యాది విధులలో
వేదంబయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీధి వీధులనే విష్ణుకథ ॥

వదలక వేదవ్యాసులు నుడివిన
విదిత పావనము విష్ణుకథ
సదనంబైనది సంకీర్తనయై
వెదకినచోటనే విష్ణుకథ ॥

గొల్లెతలు చల్లలు గొనకొని చిలుకగ
వెల్లి విరియాయె విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరు నామము
వెల్లగొలిపె నీ విష్ణుకథ ॥

# కొండలలో నెలకొన్న

కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు
కొండలంతవరములు గుప్పెడు వాడు ॥

కుమ్మరదాసుడైనకురువరతినంబి
ఇమ్మన్నవరములెల్ల నిచ్చినవాడు
దొమ్ములుసేసినయట్టి తొండమాంజక్కురవర్తి
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ॥

అచ్చపువేడుకతో అనంతాళువారికి
ముచ్చిలి వెట్టికి మన్ను మోచినవాడు
మచ్చిక దొలక తిరుమలనంబితోడుత
నిచ్చనిచ్చ మాటలాడి నొచ్చినవాడు ॥

కంచిలోన నుండ తిరుకచ్చినంబిమీద కరు-
ణించి తనయెడకు రప్పించినవాడు
యెంచ నెక్కుడైన వేంకటేశుడు మనలకు
మంచివాడై కరుణ పాలించినవాడు ॥

# సోదించిరిదియే

సోదించిరిదియే సురలును మునులును
ఆదికి ననాది హరినామం

అరిది వేదశాస్త్రార్థ సంగ్రహము
అరయగ నొకటే హరినామం
దురితహరము భవ దు:ఖనాశనము
అరిభయంకరము హరినామం

సకల పుణ్యఫలసారవిహారము
అకలంకము శ్రీహరినామం
ప్రకటము సులభము పరమపావనము
అకుటిలమిది శ్రీహరినామం

కందువ సదరము కైవల్యపదము
అందరికిదయే హరినామం
ఎందును శ్రీవేంకటేశ్వరు కరుణకు
నందుకోలైన హరినామం

# బ్రహ్మ కడిగిన

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానె నీ పాదము ॥

చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలితల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము॥

కామినిపాపము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము ॥

పరమయోగులకు పరిపరివిధముల
పర మొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమపదము నీ పాదము ॥

# ఏడవలపేడ

ఏడ వల పేడ మచ్చి కేడ సుద్దులు
ఆడుకొన్నమాటలెల్ల నవి నిజాలా ॥

తొలుకారు మెరుపులు తోచి పోవుగాక
నెలకొని మింట నవి నిలిచీనా
పొలతులవలపులు పొలసిపోవుగాక
కలకాలంబవి కడతేరీనా ॥

యెండమావులు చూడ నేరులై పారుగాక
అందకుపోవ దాహమణగీనా
నిండినట్టి మోహము నెలతలమది చూడ
వుండినట్టే వుండుగాక వూతయ్యీనా ॥

కలలోని సిరులెల్ల కనుకూర్కులేకాక
మెలకువ చూడనవి మెరసీనా
అలివేణుల మేలు ఆసపాటేకాక
తలపు వేంకటపతి తగిలీనా ॥

# ఆకటి వేళల

ఆకటి వేళల అలపైన వేళలను
తేకువ హరినామమే దిక్కుమరి లేదు ॥

కొరమాలియున్న వేళ కులముచెడినవేళ
చెరపడి వొరుల చేజిక్కినవేళ
వొరపైన హరినామమొక్కటే గతిగాక
మరచి తప్పిననైన మరిలేదు తెరగు ॥


ఆపద వచ్చిన వేళ ఆరడిబడిన వేళ
పాపపు వేళల భయపడినవేళ
వోపినంత హరినామమొక్కటే గతిగాక
మాపుదాకా పొరలిన మరిలేదు తెరగు ॥

సంకెల బెట్టిన వేళ చంపబిలిచిన వేళ
అంకిలిగా నప్పుల వారాగిన వేళ
వెంకటేశు నామమే విడిపించగతిగాక
మంకుబుద్ధి పొరలిన మరిలేదు తెరగు ॥

# శృంగార సంకీర్తనలు



ఉదయాద్రి వెలుగు



# మేలుకో శృంగారరాయ

మేలుకో శృంగారరాయ మేటి మదనగోపాల
మేలుకోవె నాపాలి మించిన నిధానమా ॥

సందడించే గోపికల జవ్వన వనములోన
కందువతిరిగే మదగజమవు
యిందుముఖి సత్యభామ హృదయ పద్మములోని
గంధము మరిగినట్టి గండు తుమ్మెద ॥

గతిగూడి రుక్మిణి కౌగిటిపంజరములో
రతిముద్దుగులికేటి రాచిలుకా!
సతులు పదారువేల జంట కన్ను కలువలకు
ఇతవై పొడమిన నా యిందుబింబమా ॥

వరుస కొలనిలోని వారి చన్నుకొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరినురమున మోచి శ్రీ వేంకటాద్రి మీద
గరిమ వరాలిచ్చే కల్పతరువా ॥

# జగడపు చనవుల

జగడపు చనవుల జాజర
సగినల మంచపు జాజర ॥

మొల్లలు తురుముల ముడిచిన బరువున
మొల్లపు సరసపు మురిపెమున
జల్లన పుప్పొడి జారగ పతిపై
చల్లే రతివలు జాజర ॥

భారపు కుచముల పైపై కడు సిం-
గారము నెరపెటి గందవొడి
చేరువ పతిపై చిందగ పడతులు
సారెకు చల్లేరు జాజర ॥

బింకపు కూటమి పెనగెటి చెమటల
పంకపు పూతల పరిమళము
వేంటపతిపై వెలదులు నించేరు
సంకుమదంబుల జాజర ॥

# వాడల వాడల వెంట

వాడల వాడల వెంట వసంతము
జాడతో చల్లేరు నీపై జాజర జాజర జాజర ॥

కలికి నవ్వులె నీకు కప్పుర వసంతము
వలచూపు కలువల వసంతము
కులికి మాటాడినదె కుంకుమ వసంతము
చలమున చల్లె నీపై జాజర జాజర జాజర ॥

కామిని జంకెన నీకు కస్తూరివసంతము
వాముల మోహపు నీటి వసంతము
బూమెల సరసములె పుప్పొడి వసంతము
సామజ గురుడ నీపై జాజర జాజర జాజర ॥

అంగన అధరమిచ్చే అమృత వసంతము
సంగడి శ్రీవేంకటేశ సతిగూడితి
ముంగిటి రతి చెమట ముత్తేలవసంతము
సంగతాయె నిద్దరికి జాజర జాజర జాజర ॥

# మూసిన ముత్యాన

మూసిన ముత్యానకేలే మొరగులు
ఆసల చిత్తానకేలే అలవోకలు ॥

కందులేని మోముకేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే సేమంతులు
మందయానమునకేలే మట్టెల మోత
గంధమేలే పైపై కమ్మని నీ మేనికి ॥

భారపు గుబ్బలకేలే పయ్యెద నీ
భీరపు చూపుల కేలే పెడమోము
జీరల బుజాలకేలే చెమటలు నీ
గోరంట గోళ్లకేలే కొనవాండ్లు ॥

ముద్దుల మాటలకేలే ముదములు నీ
అద్దపు చెక్కులకేలే అరవిరి
ఒద్దిక మాటలకేలే ఊర్పులు నీకు
నద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి ॥

# చూడరమ్మ సతులాల

చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ
కూడున్నది పతి చూడికుడుతనాచారి ॥

శ్రీమహాలక్ష్మి యట సింగారాలకే మరుదు
కాముని తల్లియట చక్కదనాల కేమరుదు
సోముని తోబుట్టువట సొంపు కళలకేమరుదు
కోమలాంగి ఈ చూడికుడుతనాచారి ॥

కలశాబ్ధి కూతురట గంభీరాల కేమరుదు
తలప లోకమాతయట దయ మరి ఏమరుదు
జలజ నివాసినియట చల్లదన మేమరుదు
కొలది మీర ఈ చూడికుడుతనాచారి ॥

అమర వందితయట అట్టే మహి మేమరుదు
అమృతము చుట్టమట ఆనందాల కేమరుదు
తమితో శ్రీవేంకటేశు తానె వచ్చి పెండ్లాడె
కొమెర వయసు చూడికుడతనాచారి ॥

# సువ్విసువ్వి సువ్వాలమ్మా

సువ్వి సువ్వి సువ్వాలమ్మా
నవ్వుచు దేవకి నందను గనియె ॥

శశి వొడచె అలసంబులు గడచె
దిశల దేవతల దిగుళ్లు విడిచె ॥

కావిరి విరిసె కంసుడు గినిసె
వావిరి పువ్వుల వానలు గురిసె ॥

గతి సేసె అటు గాడిద కూసె
కుతిలకుడిచి జనకుడు నోరు మూసె ॥

గగురుపొడిచె లోకము విధి విడిచె
మొగులు గురియగ యమునపై నడచె ॥

కలిజారె వేంకటపతి మీరె
అలమేల్మంగనాచారలుకలు తీరె ॥

# చిన్ని శిశువు

చిన్ని శిశువు చిన్ని శిశువు
ఎన్నడు చూడమమ్మ ఇటువంటి శిశువు ॥

తోయంపు కురులతోడ తూగేటిశిరసు, చింత
కాయలవంటి జడలగములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాలతోడ
పాయక యశోద వెంట పారాడు శిశువు ॥

ముద్దుల వ్రేళ్ళతోడ మొరవంక యుంగరాల
నిద్దపు చేతలపైడి బొద్దుల తోడ
అద్దపు చెక్కులతోడ అప్పలప్పలనినంత
గద్దించి యశోదమేను కౌగిలించు శిశువు ॥

బలుపైన పొట్ట మీది పాలచారలతోడ
నులివేడి వెన్నదిన్న నోరితోడ
చెలగి నేడిదె వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువు ॥

# ఏమని పొగడుదుమే

ఏమని పొగడుదుమే యిక నిన్ను
ఆమని సొబగుల అలమేల్మంగ ॥

తెలికన్నుల నీ తేటలే కదవే
వెలయగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదులివికదవే
పలుమరుపువ్వుల పానుపులు ॥

తియ్యని నీమోవి తేనెలే కదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలక నవ్వుకదె
నెయ్యపు కప్రపు నెరిబాగాలు ॥

కైవసమగు నీ కౌగిలే కదవే
శ్రీ వేంకటేశ్వరు సిరినగరు
తావుకొన్న మీ తమకములే కదే
కావించిన మీ కల్యాణములు ॥

# ఉదయాద్రి తెలుపాయ

ఉదయాద్రి తెలుపాయ ఉడురాజు కొలువిడె
అదనెరిగి రాడాయెనమ్మ నా విభుడు ॥

చన్నులపై ముత్యాల సరులెల్ల చల్లనాయె
కన్నులకు కప్పొదవె కాంత నా కిపుడు
కన్నె కలువల జాతి కనుమోడ్చినది మీద
వెన్నెల వేసంగి మొగ్గ వికసించె గదవె ॥

పువ్వుల లోపలి కురులు బిగులుకొనగా నెరసె
దవ్వుల తుమ్మెదగములు తరిమి డాయగను
రవ్వసేయ శుకపికము రాయడి కోర్వగరాదు
అవ్వల నెవ్వతె పసలకలరున్నవాడో ॥

పన్నీట జలకమార్చి పచ్చకప్రము మెత్తి
చెన్నుగ కొప్పున విరుల చెరువ తురిమి
ఎన్నగల తిరువేంకటేశుడిదె నను గూడె
కన్నులు మనసును తనియ కరుణించె గదవె ॥

# తిరొతిరొ జవరాల

తిరొతిరొ జవరాల తిత్తి తిత్తి యీ
తరలమైన నీ తారహార మదురే ॥

ధిమి ధిమ్కి తోంగ తోంగ దిద్ధిమిక్కి ఆరే
మమారే పాత్రరావు మజ్జా మజ్జా
కమలనాభుని తమకపుటింతి నీకు
అమరె తీరుపు ఇదె అవధరించగదో ॥

ఝుక్క జక్క జంఝుంఝుణకిణాని
ప్రకటపు మురువొప్పె భళాభళా
సకల పతికి సరసపు కొమ్మానీ
మొకసిరి మెరసె చిమ్ముల మురిపెములా ॥

మాయిమాయి అలమేలుమంగనాచ్చారిమతి
బాయని వేంకటపతి పట్టపురాణి
మ్రోయ చిరుగజ్జెలా నీ మ్రోతలానేని
సోయగమైన నీ సొలపు చూపమరె ॥

# ఆరగించి కూచున్నాడు

ఆరగించి కూచున్నా డల్లవాడె
చేరువనే చూడరె లక్ష్మీనారసింహుడు ॥

ఇందిరను తొడమీద నిడుకొని కొలువిచ్చి
అందపు నవ్వులు చల్లీ నల్లవాడె
చెందిన మాణికముల శేషుని పడగెమీద
చెంది వరాలిచ్చీ లక్ష్మీనారసింహుడు ॥

బంగారు మేడలోన పచ్చల గద్దియల మీద
అంగనల ఆట చూచీ నల్లవాడె
రంగగు సొమ్ముల తోడ రాజసపు విభవాల
చెంగట నున్నాడు లక్ష్మీనారసింహుడు ॥

పెండెపు పాదము చాచి పెనచి ఒకపాదము
అండనే పూజలుగొనీ నల్లవాడె
కొండల శ్రీవేంకటాద్రి కోరి అహోబలమున
మెండుగాను మెరసీ లక్ష్మీనారసింహుడు ॥

# సందెకాడబుట్టినట్టి

సందెకాడ పుట్టినట్టి చాయల పంట యెంత-
చందమాయ చూడరమ్మ చందమామ పంట ॥

మునుప పాలవెల్లి మొలచి పండినపంట
నినుపై దేవతలకు నిచ్చపంట
గొనకొని హరికన్నుగొనచూపులపంట
వినువీధి నెగడిన వెన్నెలల పంట ॥

వలరాజు పంపున వలపు విత్తిన పంట
చలువై పున్నమనాటి జాజరపంట
కలిమి కామిని తోడ కారుకమ్మినపంట
మలయుచు తమలోని మఱ్ఱిమాని పంట ॥

విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి భాగ్యము పంట
అరుదై తూరుపుకొండ నారగబండినపంట
యిరవై శ్రీవేంకటేశు నింటిలోని పంట ॥


# జయ మంగళము నీకు

జయ మంగళము నీకు సర్వేశ్వరా
జయమంగళము నీకు జలజవాసినికి ॥

శరణాగత పారిజాతమా
పోరి నసురులపాలి భూతమా
అరుదైన సృష్టికి ఆదిమూలమా ఓ
హరీ నమో పరమపుటాలవాలమా ॥

సకలదేవతా చక్రవర్తీ
వెకలివై నిండిన విశ్వమూర్తి
అకలంకమైన దయానిధి ఓ
వికచముఖ నమో విధికివిధీ ॥

కొలిచినవారల కొంగుపైడి
ములిగినవారికి మొనవాడి
కలిగిన శ్రీవేంకటరాయా
మలసి దాసులమైన మాకు విధేయా ॥




జగడపు చనవులు...




కామిశెట్టి శ్రీనివాసులు



గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్



మురళీధర్




సునీతా బాలాజీ


## అన్నమయ్య కార్తీక సంధ్య
## వాద్య సహకారం

కీబోర్డ్ - ఎస్. బ్రహ్మానందం    ఫ్లూట్ - దత్తాత్రేయ శర్మ

తబలా - నాగరాజు    వయొలిన్ - దినకర్



కొండలలో నెలకొన్న కోనేటిరాయడు



కురువరత్తినంబి



తొండమాన్ చక్రవర్తి



అనంతాళువారు



తిరుకచ్చినంబి



తిరుమలనంబి

"వెల సులభము. ఫల మధికము"

(అన్నమయ్య)


**ANNAMACHARYA MISSION**

**Kamisetty Srinivasulu**, Managing Trustee

2-2-647/103/102, 'SUDARSAN', Sai Residency,

Central Excise Colony, Hyderabad - 13. Ph: 27426842.